కథ

-జె.సునీల్

# ఆయనే మా మాస్టారు

ఇంటి ముందు కారాగింది.

అనంతంగారు వరండాలో నుండే వీధిలోకి తొంగి చూశారు. కారు దిగిన వ్యక్తి తన ఇంట్లోకే వస్తున్నాడు. 'వచ్చే వ్యక్తి ఎవరా?' అని ఆయన కళ్లు చిట్లించాడు.

అప్పటికే ఆ వ్యక్తి దగ్గరగా వచ్చి "నమస్కారం మాస్టారూ" అన్నాడు.

ఎవరో అపరిచితుడు!

"నమస్తే! కూర్చోండి" ఎదురుగా ఉన్న మరో కుర్చీ చూపించాడు అనంతం.

అతడు కూర్చున్నాక తనను తాను పరిచయం చేసుకున్నాడు. "నా పేరు రమణ! మీరు 'రమణ' కాలేజ్ పేరు వినే ఉంటారు. నేను ఆ కాలేజ్ చైర్మన్ని"

టౌన్‌లో ఆ కాలేజీకి మంచి పేరే ఉంది. కానీ అలాంటి కాలేజ్ ఓనర్ ఇప్పుడు తన ఇంటికి ఎందుకొచ్చినట్టు?

"మీరు ఈమధ్యనే రిటైరయ్యారని తెలిసింది. ఇంటర్మీడియట్ స్థాయి వరకూ మీరు మ్యాథ్స్ చాలా చక్కగా చెప్పగలుగుతారని తెలిసి, మిమ్మల్ని మా కాలేజీలో లెక్చరర్‌గా ఆహ్వానించటం కోసం వచ్చాను"

'నిజమే! తనీ మధ్యనే గవర్నమెంట్ జూనియర్ కాలేజ్ లెక్చరర్‌గా రిటైరయ్యాడు. ఆర్థిక ఇబ్బందులు కొంతవరకూ ఉన్నమాట వాస్తవమే అయినా, రిటైర్మెంట్ తర్వాత మరేదో ఉద్యోగం చేయాలని అనుకోవటం లేదు. కానీ ఇప్పుడీ వ్యక్తి వచ్చాక..'

"సార్! శాలరీ గురించి మీరసలు ఆలోచించనక్కర్లేదు. సంవత్సరానికి రెండు లక్షలు ఇవ్వాలనుకుంటున్నాం. మీరింకా డిమాండ్ చేసినా మాట్లాడుకుందాం"

'సంవత్సరానికి రెండు లక్షలు? మంచి ఆఫరే! ఆర్థిక ఇబ్బందులు తొలగిపోతాయి. ఒకవేళ ఇంకా కావాలని కోరితే... రెండున్నర లక్షల వరకూ ఇవ్వొచ్చేమో! ఒక విధంగా అదృష్టం తనను వెతుక్కుంటూ వచ్చినట్టే'

"చెప్పండి సార్! మీ ఉద్దేశ్యమేమిటి?" తను చెప్పదలచుకున్నది చెప్పాక ఆయన అభిప్రాయం అడిగాడు రమణ.

అదృష్టం ఇంటి తలుపు తడితే, అడ్డుకోవటం విజ్ఞుల లక్షణం కాదని తెలుసు. కానీ ఆలోచించుకోవడానికి ఓ రోజు గడువు అడిగాడు.

రమణ తలాడించి "మీ నుండి పాజిటివ్‌గా రెస్పాన్స్ వస్తుందని ఆశిస్తున్నాను. మీరెప్పుడైనా వచ్చి నా ఆఫీసులో కలవండి. ఉంటాను" చెప్పి వెళ్లిపోయాడు.

అప్పటివరకూ తలుపు అవల నిలబడి విషయమంతా విన్న మీనాక్షమ్మ అతడు వెళ్లిపోగానే వరండాలోకొచ్చింది. "ఏమండీ అంత మంచి అవకాశం వస్తే ఆలోచించుకుని చెపుతానన్నారేంటి?" కాసింత కోపంగానే ప్రశ్నించింది.

"గవర్నమెంట్ కాలేజీ లెక్చరర్‌కూ రిటైరైన నాకు, అంత మొత్తం ఆఫర్ చేయటంలో వారి ఉద్దేశ్యం ఏమిటో నాకు అర్థం కాలేదు. విషయమేమిటో అర్థం కాకుండా మాట ఇవ్వడం సరికాదనే అలా గడువడిగాను" చెప్పారాయన.

మీనాక్షమ్మ దీర్ఘంగా నిశ్వసించింది. "మీకన్నీ అనుమానాలే. మీరిలా ఆలోచిస్తూ కూర్చుంటే, ఆ అవకాశం మరెవరో తన్నుకుపోవచ్చు. ఆలస్యం చేయక వెళ్లి కలవండి."

ఆయన పరధ్యానగానే తలాడించాడు.

★ ★ ★

ఎంత ఆలోచించినా ఆ ఆఫర్ 'వద్దు' అనడానికి కారణం కనిపించలేదు. అందుకే మర్నాడు కాలేజీకి వెళ్లి తను కాలేజీలో జాయిన్ అవుతున్నట్లుగా చెప్పాడు.

ఆ మర్నాడు ఆయన క్లాసులో ఉండగా ఆఫీస్ బోయ్ వచ్చాడు. "సార్! క్లాస్ అయిపోయాక మిమ్మల్ని రమణసారు రమ్మంటున్నారు."

క్లాస్ ముగించుకున్నాక, అనంతంగారు ఆఫీస్ రూమ్ వైపు నడిచారు. ఆయన రూమ్‌లోకి వెళ్లగానే "రండి సార్! రండి" అన్నాడు రమణ.

ఆయనకు కుర్చీ చూపించాక, పక్కనే ఉన్న ఓ పోస్టర్‌ని టేబుల్ మీద ఉంచి విప్పాడు.

"నన్ను రమ్మన్నారంట"

"ఇదిగో! ఈ పోస్టర్‌ని చూడడానికే పిలిపించాను"

అనంతంగారు పోస్టర్‌కేసి చూశారు. ఆ పోస్టర్‌లోని మ్యాటర్ చదువుతుంటే మొదట అర్థం కాలేదు. అర్థమయ్యాక గుండె ఆగినట్టనిపించింది. ఆయన ఆ మ్యాటర్‌కేసి మరోసారి చూసి చదివారు.

"ప్రముఖ శాస్త్రవేత్త, రాష్ట్ర గవర్నర్ నిరుపమ్‌గారి గురువు 'శ్రీ అనంతంగారు' 'రమణ కాలేజీ'లో జాయినయ్యారు."

అది హెడ్డింగ్. అక్కడి నుండి "అంత పెద్దవాడికే మ్యాథ్స్ బోధించిన మహా మేధావి శ్రీ అనంతంగారు భావితరాలను మరింత మేధావులుగా తీర్చిదిద్దటం కోసం తన సేవలు మన సంస్థ ద్వారా అందించబోతున్నారు" అంటూ వివరణ.

"పోస్టర్ ఎలా ఉంది మాస్టారు?"

ఒక్క నిముషం నిశ్శబ్దం తర్వాత అనంతంగారు మాట్లాడారు. "నేనీ ఉద్యోగం వదిలేస్తున్నాను. దయచేసి నన్ను బలవంతపెట్టకండి."

రమణ ముఖంలో కంగారు కదలాడింది. "ఎందుకు... ఎందుకలాంటి నిర్ణయం తీసుకుంటున్నారు? మీకు చెప్పకుండానే పోస్టర్స్ పబ్లిసిటీ ప్రారంభిస్తున్నామని కోపం వచ్చిందా?"

"ఇది కోపం కాదు బాబూ! విలువలకు సంబంధించిన విషయం."

"అంటే?"

ఆయన అదోలా నవ్వాడు. రమణ ఆయన ముఖంలోకే ఆందోళనగా చూస్తున్నాడు. "బాబూ! శిష్యుల గురించి గురువు గర్వంగా చెప్పుకోవచ్చు. కానీ తన వ్యాపారంగా పెంచుకోవడం కోసం వారి పేరుని వాడుకోవడం తగదు.

'అర్జునుడు నా శిష్యుడు' అని ద్రోణుడు గర్వంగా చెప్పుకున్నాడే తప్ప, ఆ పేరుని వాడుకుని తను లాభపడలేదు. నేడు విద్య వ్యాపారమయ్యాక శిష్యుల పేర్లే ప్రకటనలకు ఆధారమయ్యాయి. నిజమే! ప్రముఖ శాస్త్రవేత్త, రాష్ట్ర గవర్నర్ నిరుపమ్ నా శిష్యుడే! కానీ అతడి పేరుని వాడుకుని, ఈ ఉద్యోగం కొనసాగిస్తూ,

రెమ్యునరేషన్ అందుకోవడం నాకిష్టం లేదు. నన్ను క్షమించండి”

“ఇందులో తప్పేముంది మాస్టారూ! నిరుపమ్ గారు మీ శిష్యుడన్నది నిజం. మీలాంటి గురువు తనకు దొరకడం తన అదృష్టమని ఆయనే అనేక సందర్భాలలో బహిరంగంగా చెప్పారు. ఆ విషయాన్నే మనం పబ్లిసిటీ చేసుకుంటున్నాం” రమణ ఆయనకు నచ్చచెప్పే ధోరణిలో పలికాడు.

అనంతం తల అడ్డంగా ఆడించాడు. “వద్దు! శిష్యుడి గురించి గురువు పబ్లిసిటీ చేసుకునే వ్యాపారధోరణి నాకొద్దు”

“పోనీ! మీరు కోరుకుంటే మరో లక్ష ఇవ్వడానికైనా నాకు ఇబ్బంది లేదు. చెప్పండి మాస్టారూ! మీ రెమ్యునరేషన్ మరో లక్ష పెంచమంటారా? మీలాంటి వ్యక్తి మాకెంతో అవసరం. మీరు మా సంస్థలో పనిచేస్తున్నారని తెలిస్తే ముఖ్యంగా మీరు నిరుపమ్‌గారు గురువుగారని తెలిస్తే చాలు, స్టూడెంట్స్ ఈ కాలేజీలో చేరడానికి క్యూ కడతారు. నాక్కావలసింది అదే!”

“నాక్కావల్సింది మరోటి ఉంది” అంటూ లేచారాయన.

“ఏమిటది?”

“అదేమిటో చెప్పినా మీలాంటి వారు అర్థం చేసుకోలేరు.” ఆయన బయటకు నడిచాడు.

అనంతంగారు ఇంటికి చేరుకునేసరికి అక్కడంతా హడావుడిగా ఉంది. ఇంటి ముందు నాలుగైదు కార్లు ఆగి ఉన్నాయి. జనం గుంపుగా ఉన్నారు.


ఆయన కంగారుగా ఇంటి గేటు దాటి లోపలికి అడుగుపెడుతూ, అటు చూశారు. మొదట తన కళ్లను తనే నమ్మలేకపోయారు.

ఆ విస్మయ స్థితిలో ఆయన ఉండగానే, అప్పటివరకూ కుర్చీలో కూర్చుని ఉన్న నిరుపమ్ ఒక్క అంగలో దగ్గరకు చేరారు. “బాగున్నారా మాస్టారూ” అంటూ ఆయన కాళ్లకు నమస్కారం చేయబోయారు.

అలా చేయకుండా అనంతంగారు అడ్డుకుని “నిరుపమ్.. నిరుపమ్‌గారు.. మీరు.. మా ఇంటికి...” ఏం మాట్లాడాలో అర్థం కాలేదు. దేశంలోనే గొప్ప శాస్త్రవేత్తగా పేరు తెచ్చుకుని, రాష్ట్ర గవర్నర్‌గా పదవి చేపట్టిన తన శిష్యుడు, తను ఊహించనంత స్థాయికి వెళ్లి, తనను మరచిపోకుండా, ఇంటికి వస్తే... ఏం మాట్లాడాలి? ఎలా మాట్లాడాలి?

“మాస్టారూ! మీరు నన్ను గౌరవించక్కర్లేదు. నేనిక్కడికి మీ శిష్యుడిగానే వచ్చాను. రాష్ట్ర గవర్నర్‌గా రాలేదు” అన్నాక, తనే చెప్పాడు. “రండి మాస్టారూ...కూర్చోండి.”

అనంతంగారు కూర్చున్నాకే నిరుపమ్ ఆయన ఎదురుగా కూర్చున్నాడు. అతడి బాడీగార్డ్స్, సెక్రటరీ, ప్రాంతీయ నాయకులు అందరూ నిలబడే ఉన్నారు.





“హైదరాబాద్ నుండి ఎప్పుడొచ్చావ్ నిరుపమ్”

“ఉదయమే వచ్చాను మాస్టార్! మన జిల్లాలో ఏదో కొన్ని ప్రారంభోత్సవాలున్నాయి. వాటిని ముగించుకుని వెళ్తూ, మిమ్మల్ని చూసేందుకిలా వచ్చాను.”

“చాలా సంతోషం” ఎంతో ఉన్నత స్థాయికి వెళ్లినా, తనను గుర్తుపెట్టుకోవడమే కాదు, ఎంతో బిజీ టైమ్‌లో కొంత సమయం తన కోసం వెచ్చించడము నిజంగానే తనకెంతో ఆనందం కలిగిస్తోంది.

నిరుపమ్ నవ్వాడు. “ఈ శిష్యుడిని చూస్తే మీకు సంతోషం. కానీ మా గురువుగారిని చూస్తే మాకు అభిమానం, గౌరవం ఎందుకో తెలుసా మాస్టారూ! నేను మంచి స్థాయికి రాగానే కాస్త పరిచితులు కూడా నన్ను చేరి సహాయం కోరారు. మీరెన్నో కష్టాల్లో ఉన్నారని నాకు తెలుసు. మీరొచ్చి అడిగితే, నేను కాదనను అనీ మీకు తెలుసు. అయినా సరే, ఏ రోజూ మీరు ఈ శిష్యుడికి సహాయం అర్థిస్తూ రాలేదు. మీరు శిష్యుడి ఉన్నతిని చూసి ఆనందించారే తప్ప, ఉపయోగించుకోవాలని ఆలోచించలేదు. ఇంత గొప్ప మాస్టారు, నాకు మాస్టార్ అయినందుకు నేనెంత గర్వపడుతున్నాను” అతడి మాటలు ఆ చుట్టూ ఉన్నవాళ్లూ వింటున్నారు.

అనంతంగారికి ఉదయం జరిగిన సంఘటన మనసులో మెదలాడింది. కానీ ఏం మాట్లాడాలో తోచక ఆయన మౌనంగా ఉండిపోయాడు.

అతడు తను చెప్పదలచుకున్నది పూర్తిచేశాడు. “మాస్టారూ! శిష్యుడి స్థాయిని చూస్తూ ఆనందిస్తూ, ఆ ఆనందాన్ని గుండెల్లో దాచుకునేవాడు గొప్ప గురువు. ఏ స్థాయికి వెళ్లినా, కన్నతల్లిని, జన్మభూమిని మరచిపోనట్టే గురువునీ గుర్తుపెట్టుకుని ‘ఆయనే మా మాస్టారు’ అని ప్రపంచానికి చెప్పేవాడే నిజమైన శిష్యుడు. ఇప్పుడు నేను ఆ పనే చేయబోతున్నాను. గవర్నర్ స్థాయిలో ఉన్న నేను అందించే ఈ గురుదక్షిణ ఘనంగానే ఉండబోతోంది. మీరిక కష్టాలతో సహవాసం చేయవలసిన అవసరం లేకుండా చేస్తుంది. ఇది నిజం.”

అనంతంగారి కళ్లల్లో నీళ్లు చిప్పిల్లాయి. ‘ఇదే... ఇదే నేను కోరుకున్నది’ ఆయన మనసులోనే అనుకున్నాడు.

★